

25న కొవ్వూరులో జాబ్‌డ్రైవ్

కొవ్వూరు రూరల్ : వికాస ఆధ్వర్యంలో స్థానిక కొవ్వూరు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ఈ నెల 25న జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జె.సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ(ప్రొడక్షన్) ఉద్యోగానికి బిఎస్‌సి(కెమిస్ట్రీ), బిజెడ్‌సి, ఎంపిసి, సిబిజెడ్ గ్రూపులో 2017 నుంచి 2022 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.19,477 వేతనం, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉంటుందన్నారు. నిట్(నవినిస) బ్యాంక్‌లో రిలేషన్ షిప్ మేనేజర్, సీనియర్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 25 ఏళ్లలోపు వారు, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు అర్హులు. వీరికి ఏడాదికి రూ.2.4 లక్షల నుంచి రూ.3.1 లక్షల వరకు వేతనం ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25న కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరుకావాలన్నారు. వివరాలకు 8309010013 నెంబర్‌ను లేదా www.vikasajobs.com సంప్రదించాలని తెలిపారు.

దుంప రైతు దిగాలు

- దిగుబడి లేక ధర రాక ఇబ్బందులు
- నష్టాల్లో కూరుకు పోతున్నవైనం
- మద్దతు ధర రూ.2వేలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - గోకవరం

దిగుబడి రాక.. ధర లేక దుంప రైతు దిగాలు చెందుతున్నారు. నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. పంట సాగుకోసం పెట్టుబడికి చేసిన అప్పులు తీర్చలేక అయోమయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతుందా.. అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

గోకవరం మండలంలో ఏజెన్సీకి ఆనుకుని ఉన్న మల్లవరం, చుట్టుపక్కల గ్రామాల రైతులు దుంప సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. సుమారు 2 వేల ఎకరాల్లో ఈ ఏడాది రైతులు దుంప సాగు చేపట్టారు. ఎకరాకు రూ.30వేల వరకూ పెట్టుబడి పెట్టారు. ఈ ఏడాది వర్షాల కారణంగా దుంప తోటలు ఉబికెత్తిపోయి దుంపలు కుళ్లిపోయాయి. ఫలితంగా దిగుబడి తగ్గిపోయింది. ఎకరానికి 40 నుంచి 50 బస్తాలు దిగుబడి రావాల్సి ఉండగా 15 నుంచి 20బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. దుంపను కమీషన్ పద్ధతిపై దళారులు కొనుగోలు చేస్తుంటారు. ఈ ఏడాది మద్దతు ధర 70 కేజీల బస్తాకు రూ.1,500 నిర్ణయించారు. అయినా రూ.20 వేలు కూడా దక్కడం లేదు. పంటకు లాభం రాకపోగా రూ.20 వేల వరకు నష్టం వస్తుంది. మద్దతు ధర రూ.2వేలు చేస్తే కనీసం పెట్టుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు.

దళారుల దోపిడీ

దుంప ముక్కను కొనుగోలు చేసుకునేందుకు గతంలో ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వ్యాపారులు నేరుగా వచ్చేవారు. దీని వల్ల దుంప రైతులకు లాభాలు ఎలా ఉన్నా నష్టాలు మాత్రం వచ్చేవి కావు. ప్రస్తుతం దళారులు ప్రవేశించడంతో రైతులు నష్టాల బాట పడుతున్నారు. గ్రామంలోనే కమీషన్ దారులు దళారులుగా ఏర్పడి వ్యాపారాలను రాకుండా అడ్డుకుంటున్నారు. దళారులే ధరను నిర్ణయిస్తున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేసి వారు మాత్రం ఎక్కువ ధరకు అమ్ముకుని లాభాలు గడిస్తున్నారని రైతులు వాపోతున్నారు. దళారులను అరికట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



దుంపలను ముక్కలుగా చేస్తున్న కూలీలు



మద్దతు ధర పెంచాలి

ఇతర పంటలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుంది. దుంప రైతులకు మాత్రం ఎప్పుడూ మద్దతు ధర పెంచలేదు. సాగు ఖర్చులకు కూడా రైతుల శ్రమను దోచుకుంటున్నారు. పంట చేతికి వచ్చే సరికి రూ.30వేలనుంచి రూ.40వేల వరకు ఖర్చు అవుతుంది. దుంప సాగు నమ్ముకుని అనేక కుటుంబాలు జీవిస్తున్నాయి. ప్రభుత్వం ఇటువంటి రైతులను ఆదుకోవాలి.

- దేవర రాజబ్బాయి, దుంప కూలీ మల్లవరం



వర్షాలు నట్టేట ముంచాయి

ఈ ఏడాది వర్షాలు నట్టేట ముంచాయి. ఎక్కువగా కురవడం వల్ల దుంప ఊటబడి పంట చాలా వరకూ కుళ్లిపోయింది. ఎకరాకు 45 నుంచి 50 బస్తాల దిగుబడి రావాల్సింది సగం రాలేదు. ఈ ఏడాది తీవ్ర నష్టాలు చోటుచేసుకున్నాయి.

- వెలుగుల సింగారమ్మ, దుంప రైతు మల్లవరం

ఎకరాకు రూ.30వేలు పెట్టుబడి పెట్టా...

ఈ ఏడాది దుంప దిగుబడిన లేదు. ధర కూడా లేదు. నేను 4.50 ఎకరాల్లో దుంప సాగు చేపట్టాను. ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టాను. ప్రస్తుత ధర ప్రకారం ఎకరాకు రూ.20వేలు కూడా రావట్లేదు. మద్దతు ధర రూ.2వేలు ఇప్పించాలి.

- అప్పారావు, దుంప రైతు మల్లవరం.



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

భవిత కేంద్రంలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తాడితోట మున్సిపల్ ఎంపి స్కూల్ భవిత ఉప కేంద్రంలో కలెక్టర్ కె.మాధవీలత బుధవారం తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలతో ఆమె మాట్లాడారు. పాఠశాలలో చేపడుతున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మానసిక పరిపక్వత, శారీరక దారుఢ్యం పెంపు దిశగా చేపడుతున్న కార్యాచరణ ప్రణాళికపై ఆరా తీశారు. మానసిక ఆరోగ్య స్థాయి పెంచే విధానంలో నిరంతర అభ్యాస ప్రక్రియను చేపట్టడం జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఫిజియోథెరపిస్టుల ద్వారా క్రమం తప్పకుండా వ్యాయామం చేయిస్తున్నామన్నారు. రెగ్యులర్‌గా వైద్యపరీక్షలను నిర్వహించి మందులు అందిస్తున్నామని కలెక్టర్‌కు తెలిపారు. విద్యార్థులకు అందుతున్న ఫిజియోథెరపీ సేవలను డాక్టర్ మధుశ్రీ కలెక్టర్‌కు వివరించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు పింఛను అందించడం పట్ల కలెక్టర్‌కు పిల్లల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఎవరైనా పిల్లలకు పెన్షన్ సౌకర్యం లేకపోతే వారి వివరాలు అందచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పిల్లలందరికీ శాశ్వత సదరం సర్టిఫికెట్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిఎంఅండ్‌హెచ్ఒ, డిఆర్‌డిఎ పీడీ, డిఇఒలనుకలెక్టర్ ఆదేశించారు.

మధ్యాహ్న భోజనంపై దిశా నిర్దేశం

అనంతరం ఎన్‌విఆర్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కలెక్టర్ మాధవీలత పరిశీలించారు. వారంలో ఏ రోజు ఏ రంగు స్టాంపు వేసిన కోడిగుడ్లు వస్తున్నాయనే సమాచారాన్ని బోర్డులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో నిర్వహణలో ప్రతి అంశం పట్ల ప్రధానోపాధ్యాయులు పూర్తి నిబద్ధతతో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం నెలలో ఏ వారంలో ఏ రంగు స్టాంప్ ఉన్న కోడి గుడ్డు అందజేస్తున్నారో, బహిరంగంగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట డిఇఒ ఎస్.అబ్రహం, అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్, డిఆర్‌డిఎ పీడీ సుభాషిణి, ఐసిడిఎస్ పీడీ, ఎన్‌విఆర్ స్కూల్ హెచ్‌ఎం కె.డేవిడ్‌లివింగ్‌స్టన్, సమగ్ర శిక్షా కో-ఆర్డినేటర్ స్నేహలత, నాన్ భవిత సెంటర్ ఐఆర్‌టి టీచర్ వరలక్ష్మి, సిఆర్‌పి జయంతి శాస్త్రి పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

వైఎస్ఆర్ లా నేస్తంలో 112 మందికి లబ్ధి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వైఎస్ఆర్ లా నేస్తం పథకం ద్వారా జిల్లాలో 112 మంది యువ న్యాయవాదులకు లబ్ధి చేకూరింది. ఈ విడతలో మొదటి ఆరు నెలలకు రూ.33.60 లక్షల ప్రయోజనం చేకూరనుంది. వైఎస్ఆర్ లా నేస్తం పథకాన్ని వర్చువల్ ద్వారా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారు. చిత్తూరు జిల్లా 8వ సెషన్స్ జడ్జి, ఎపి ప్రభుత్వ లా కార్యదర్శి జి.సత్య ప్రభాకర్‌రావు ముఖ్యమంత్రితో కలిసి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం న్యాయవాదులకు తోడుగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ సాయం అందిస్తుందన్నారు. దీనిని న్యాయ వాదులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదలకు న్యాయసేవలు అందించేందుకు యువ న్యాయవాదులు కృషి చేయాలన్నారు. న్యాయవాదిగా నమోదు చేసుకున్న యువ న్యాయవాదులకు ప్రతి నెలా రూ.5 వేల చొప్పున మూడేళ్లపాటు ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎస్.సుభాషిణి, ఎస్‌సి సంక్షేమ జిల్లా అధికారి జి.జనార్ధనరావు, గిరిజన సంక్షేమ జిల్లా అధికారి కెఎన్.జ్యోతి, బిసి సంక్షేమ జిల్లా అధికారి పిఎస్.రమేష్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు, న్యాయ వాదులు సయ్యద్ ఎంఎస్.హుస్సేన్, ఎమ్‌డి అబ్దుల్ అరీఫ్, వై.అశోక్‌కుమార్, పివివిఎస్‌బి.రాజు, ఎస్.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



లానేస్తం పథకం లబ్ధిదారులు, అధికారులు



అన్నదానం చేస్తున్న రాంబాబు, వెంకటేశ్వరావు తదితరులు

500వ రోజుకు అన్నదానం

స్వర్ణాంధ్ర రాంబాబుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

500 రోజుల పాటు నిర్విరామంగా అన్నార్తుల ఆకలి తీర్చడం అభినందనీయమని లయన్స్ పూర్వపు గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పుష్కర ఘాట్‌లో లయన్స్ క్లబ్, స్వర్ణాంధ్ర సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, రత్న రియాలిటీ మేనేజింగ్ డైరెక్టర్ విబి.రాయుడు పాల్గొని మాట్లాడారు. స్వర్ణాంధ్ర రాంబాబు చేస్తున్న అన్నదాన కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి రాంబాబు రోజుకు సుమారు 500 మందికి నిత్య అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారన్నారు. దీనికి నగరంలోని దాతలు, లయన్స్ సభ్యులు అందరూ సహకరించాలని అభ్యర్థించారు. ఇప్పటివరకు 1,64,540 మందికి అన్నదానం అందించారన్నారు. 5వేల మంది వాలంటీర్లు సేవలందించారని తెలిపారు. వారందరికీ రాంబాబు ధన్యవాదాలు తెలిపారు. హైకోర్టు న్యాయవాది రంగరాజన్, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ పూర్వపు సూపరింటెండెంట్ ఇంజినీర్ లయన్ కొల్లూరి గోపాలకష్ణ, హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి అనూప్‌జైన్, జమాతే ఇస్లాం హిందూ రాజమండ్రి శాఖ అధ్యక్షులు హిమైతుద్దీన్, అన్సర్ అహ్మద్, సుబ్రహ్మణ్యం, అమీర్, దువ్వాడ రాజా, స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను రాంబాబు సత్కరించి జ్ఞాపికలను అందించారు.

స్వాతంత్ర్య సంగ్రామంలో కళాకారులది కీలకపాత్ర

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్వాతంత్ర్య సంగ్రామంలో కళాకారులు కీలక పాత్ర పోషించారని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా రిజిస్ట్రార్ డాక్టర్ జ్వాల ప్రసాద్ అన్నారు. భారత్ రంగ్ మహోత్సవ్ -2023లో భాగంగా బుధవారం 'శ్మశాన కురుక్షేత్రం' కన్నడ నాటికను ప్రదర్శించారు. నాటక ప్రదర్శన అనంతరం జ్వాలప్రసాద్ మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య సమర పోరాట సమయంలో ఆనాటి దేశ నాటక రంగ కళాకారులు పోషించిన పాత్ర ఎనలేనిదన్నారు. అటువంటి కళలను భవిష్యత్తు తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రాంతీయ కేంద్రాన్ని రాజమహేంద్రవరంలో స్థాపించనున్నారు. అందులో భాగంగా ఆనం కళాకేంద్రంలో భారత్ రంగ్ మహోత్సవ్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం కళాకారులకు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరంలో నిర్వహించే ఫెస్టివల్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ పి.వెట్రి భూపతి, బెంగళూరు ఎన్ఎస్‌డి సెంటర్ డైరెక్టర్ వీణ శర్మ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్మశాన కురుక్షేత్రం

బుధవారం ప్రదర్శించిన కన్నడ నాటకం 'శ్మశాన కురుక్షేత్రం ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రపంచం గుర్తించిన మలయాళ కవి కువెంపు మహాభారత కురుక్షేత్ర యుద్ధపు భయంకర పరిణామాలను క్లుప్తీకరించి అద్భుతంగా నాటకాన్ని రచించారు. మహాభారతాన్ని ప్రేక్షకులకు కళ్లకు కట్టినట్టగా కళాకారులు ఆవిష్కృతం చేశారు. మహాభారతంలో 18 రోజుల పాటు జరిగిన కురుక్షేత్ర యుద్ధం గురించి ప్రతి ఒక్కరు తప్పక వినేవుంటారు. అక్కడో ఇక్కడో చదివి తెలుసుకుని ఉంటారు. ఈ భయంకరమైన యుద్ధం పరిణామాలను నాటకంలో ఆవిష్కరించారు. మహాభారత యుద్ధం, దాని పర్యవసానాలు, ప్రాణాలతో బయటపడినవారి బాధలు, పశ్చాత్తాపం, వేదన, ఆందోళన అందరినీ ఆలోచింపజేశాయి. యుద్ధం అనేది కులం, మతం, సంప్రదాయం, దేశాల మధ్య, ధనిక మరియు పేదల మధ్య వివిధ కోణాలను కలిగి ఉంటుంది. అన్నింటికంటే, యుద్ధం అనేది వ్యక్తి, వ్యక్తిత్వం మధ్య, మనస్సుల మధ్య జరిగే ఒక విషయం. 'శ్మశాన కురుక్షేత్రం' అనే ఈ నాటకంలో దీని గురించి సున్నితమైన చిత్రణ జరిగింది. కన్నడ కళాకారులు తమదైన శైలిలో అద్భుతం గా ప్రతి ఒక్కరు పాత్రాల్లో మమేకమై ఆనాటి కురుక్షేత్ర యుద్ధం అనంతరం జరిగిన సన్నివేశాలను ఎంతో అద్భుతం గా నాటకం లో ప్రదర్శించారు. ప్రధాన పాత్రల్లో తల్లిగా పూర్ణమ్మ, గాంధారిగా విద్య, కుంతిగా విద్యాలక్ష్మి, భీముడిగా అరుణ్ కుమార్, ధర్మరాజుగా రవిశంకర్, కృష్ణుడిగా విశ్వనాథ్, సహదేవుడుగా అక్షయ్ కుమార్, ధృతరాష్ట్రుడిగా మధు, అశ్వద్ధామగా ప్రకాష్, దుర్యోధనుడుగా పవన్ నటించారు. సవితా బైరప్ప దర్శకత్వం వహించగా రాఘవేంద్ర సంగీతం అందించారు.



శ్మశాన కురుక్షేత్రం నాటకంలో ఓ సన్నివేశం

ఆక్వా మార్కెటింగ్‌పై సమీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆక్వా ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యూహంపై మత్స్యశాఖ కమిషనర్ కె.కన్నబాబు జిల్లాల కలెక్టర్లతో బుధవారం అమరావతి నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి నాన్ మార్కెటింగ్ వ్యూహం, అందుబాటులో ఉన్న పథకాలపై జిల్లా మత్స్య అధికారి కెవి.కష్ణారావుతో కలిసి కలెక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశీయ చేపల మార్కెటింగ్‌ను ప్రోత్సహించడం ద్వారా ఆక్వా రంగంలో మరిన్ని ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆ దిశలో జిల్లాలో జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో సానుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నామనానరు. జిల్లాలోని ఆరు మండలాల్లో గుర్తించిన 971.44 ఎకరాల్లో ప్రస్తుతం ఉన్న 967.94 ఎకరాలను జిల్లాలోని నాన్ ఆక్వాజోన్ నుంచి ఆక్వా జోన్‌గా మార్చేందుకు ఆమోదం తెలిపామన్నారు. ఈ-మత్స్యకార్ వెబ్ పోర్టల్‌లో సమర్పించిన 967.94 ఎకరాల (ఫేజ్-1) సర్వే నంబర్ల ప్రతిపాదనలను ప్రభుత్వ మత్స్యశాఖ కమిషనర్ ఆమోదం తెలిపారన్నారు. జిల్లాలో అదనంగా, మండల స్థాయి కమిటీ ఆమోదించిన 57.97 ఎకరాల అనుబంధ విస్తీర్ణం (ఫేజ్-2) ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ఇంకా ఏమైనా క్రమబద్ధకరణకు అర్హమైన భూములపై మరోసారి నాన్ ఆక్వా జోన్ నుంచి ఆక్వా జోన్‌లోకి మార్చే అవకాశం ఉన్న వాటిని గ్రామ సభలు ద్వారా గుర్తించాలన్నారు. మండల స్థాయి కమిటీ నిర్ణయం తీసుకుని జిల్లా కమిటీకి ప్రతిపాదనలు అందించాలని క్షేత్ర స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ వివరించారు.

ఒడిశా రైతులు సత్యదేవా నర్సరీ సందర్శన

కడియం : ఒడిశా రైతులు బుధవారం కడియం సత్యదేవా నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ఉద్యాన అధికారి డి.సుధీర్‌కుమార్ రైతులకు కడియం నర్సరీల విశిష్టత, ఇక్కడ అవలంబించే సస్యరక్షణ పద్ధతులు, నర్సరీ మొక్కల్లో సాధారణంగా వచ్చే చీడ పీడలు వాటిని అరికట్టే పద్ధతులు వివరించారు. అలాగే నర్సరీ మొక్కల పెంపకంలో పోలీహౌజ్ ఎంతో ఉపయోగం అని తెలియచేశారు. ట్రైనింగ్‌లో భాగస్వాములు అయిన రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించారు. ఈ కార్యక్రమంలో ఒడిశా హార్టికల్చర్ ఎడి ప్రశాంత్ కుమార్‌బెహరా, అశోక్‌కుమార్ పైకరే, నర్సరీ అధినేతలు పుల్లా ఆంజనేయులు, వీరబాబు, రాజశేఖర్ పాల్గొన్నారు.

పాఠశాల లైబ్రరీకి కుర్చీల వితరణ

కడియం : కడియం ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.27 వేల విలువైన కుర్చీలను అందించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సత్యనా రాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రీజనల్ డిజిఎం పి.కష్ణయ్య మాట్లాడారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను బోధిస్తున్నారని, అలాగే గ్రంథాలయాలను ఖాళీ సమయాల్లో ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడియం బ్రాంచ్ మేనేజర్ డి.శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ జి.రవికుమార్, ఉపాధ్యాయులు కె.రాజు, డేవిడ్, శరత్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డి.జి.ఎం

వైద్య శిబిరం విజయవంతం

నల్లజర్ల : పోతవరం ప్రభుత్వాసుపత్రి ఆవరణలో బుధవారం ఆశ్రం ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్యశిబిరం విజయవంతైంది. ఈ వైద్య శిబిరానికి మారుమూల ప్రాంతాలకు చెందిన దాదాపు పది గ్రామాల నుంచి 245 మంది వైద్యసేవల కోసం వచ్చారు. సాధారణ వైద్య సేవలతో పాటు ఆర్థోపెడిక్, ఇఎన్‌టి, అప్తల్మిక్, గైనిక్, స్కిన్‌కు సంభందించిన స్పెషలిస్ట్ వైద్యులు వైద్యసేవలు అందించారు. ఆశ్రం ఆసుపత్రి ప్రజా సంభందాల అధికారి కంకిపాటి ముసలయ్య పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పోతవరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వెంకట్రావు, ఎంపిహెచ్ఇఒ పలివెల సత్యం, నర్సు కె.ఇందిర, హెల్త్ సూపర్ వైజర్ జమిలా, ఆశాలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు...

తాళ్లపూడి : రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలంటే పార్టీల్లో అన్ని విభాగాల సిబ్బంది ఓటర్లు గుర్తింపుతో పాటు అన్ని విషయాల్లోనూ అవగాహనతో ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మంగళగిరి టిడిపి కార్యాలయం పరిశీలకు సుబ్రహ్మణ్యం సూచించారు. మండలానికి సంబంధించిన బూత్ లెవెల్ కమిటీ యూనిట్ ఇన్‌ఛార్జులు, గ్రామ కమిటీలకు బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే ఓటర్ల జాబితా ఆధారంగా ప్రతి ఇంటికీ వెళ్లి పూర్తి సమాచారాన్ని సేకరించాలన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు వంటి వివరాలు సేకరించాలని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు నామన పరమేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి దుర్గారావు నాయకులు చలపతి ప్రకాష్, ఎం.సంపత్ తదితరులు పాల్గొన్నారు.

చిలకపాడులో ఫ్యామిలీ ఫిజీషియన్

ఉండ్రాజవరం : మండలంలోని సత్యవాడ సచివాలయం పరిధిలోని చిలకపాడులో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్.ఉషాదేవి ఆధ్వర్యంలో 100 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఈ సందర్భంగా ఉషాదేవి మాట్లాడారు. పట్టణాలకు దూరంగా ఉన్న గ్రామాల్లో ప్రభుత్వం 104 సంచార వాహనం ద్వారా వైద్య సేవలు అందిస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జె.శ్రీనివాసు, హెల్త్ విజిటర్ కె.నాగమణి, ఎంఎల్‌హెచ్‌పి పి.బ్యూలాజోయ్, ఎఎన్ఎం సిహెచ్.దుర్గామల్లీశ్వరి, హెల్త్ అసిస్టెంట్ బి.శ్రీనివాసు, డిఇఒ ఎస్.శ్రావణ్‌కుమార్, ఆశాలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఎపిలో... ఇప్పటికీ మిమ్మల్ని నిత్యం తలచుకుంటున్నారు.. ప్రభూ..!

లాభాల ఫంగస్

పెరుగుతున్న కొత్తరకం చేపల సాగు

ప్రజాశక్తి - కడియం

ఇతర దేశాల నుంచి వచ్చిన పంగాసియస్(ఫంగస్) మన రాష్ట్రంలో ఎన్నో నిందలు మోస్తూ మొత్తానికి నిలదొక్కుకుంది. రైతులకు లాభాల పంట పండిస్తోంది. ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. జెల్ల జాతికి చెందిన ఈ చేప తింటే వాతం వస్తుందని అపోహ బలంగా నాటుకుపోయింది. కాని ఈ చేప తినడం వల్ల ప్రయోజనాలు ఉంటాయని గుర్తించడంతో ఇతర రాష్ట్రాలకు భారీగా ఎగుమతులు జరుగుతున్నాయి. అందుకనే ఇప్పుడు ఉమ్మడి గోదావరి జిల్లాలలో ఈ చేప సాగు పెరుగుతోంది. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన ఈ చేప ప్రభుత్వ ఆమోదం పొందింది. ఆక్సిజన్, నీరు వంటివి తక్కువ అయినప్పటికీ చలించకుండా జీవిస్తుంది. తెగుళ్లను ఎదుర్కొంటుంది. పెరుగుదలలో దీనిని మించింది లేదనే చెప్పాలి. మామూలు జాతి చేపలు ఏడాదికి 1 కేజీ నుంచి 2 కేజీలు పెరిగితే ఇది 2.5 కేజీల నుంచి 4 కేజీలు బరువు పెరుగుతుంది. ధర తక్కువైనా దిగుబడి అధికంగా ఉండడం వల్ల రైతుకు గిట్టుబాటు అవుతుంది. ఎకరాకు 10 నుంచి 15 టన్నుల దిగుబడిని కూడా కొందరు రైతులు సాధించారు. సరాసరి రైతు ధర కేజి రూ.70 నుంచి రూ.80 ఉంటుంది. కడియం మండలం వేమగిరి, రూరల్ మండలం ధవళేశ్వరం, బొమ్మూరు తదితర ప్రాంతాలలో ఈ చేప సాగు చేపడుతున్నారు. పశ్చిమ బెంగాల్, బీహార్ వంటి రాష్ట్రాలకు పెద్ద మొత్తంలో ఈ చేప ఎగుమతులు జరుగుతున్నాయి.



ఫంగస్ రకం చేపలు

అపోహలను వీడాలి

ఫంగస్ చేపపై కొందరికున్న అపోహలు తొలగాలి. ఈ చేపను అన్ని వయస్సుల వారు తినొచ్చు. ముల్లు సమస్య ఉండదు. అందుబాటు ధరలో దొరుకుతుంది. రైతులకు ఎంతో గిట్టుబాటు ఇస్తున్నందున ఈ చేప సాగుకు ముందుకొస్తున్నారు.

-వి.కష్ణారావు, జిల్లా మత్స్య శాఖ అధికారి

ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పిఎంకెవివై పథకంలో భాగంగా జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం వివిధ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ జివి.రమణారావు తెలిపారు. ఇందులో భాగంగా డోమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్, ఆర్ అండ్ ఎసి మెకానిక్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, స్వీయింగ్ మెషీన్ ఆపరేటర్(స్త్రీలకు), టాలీ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు, 5వ తరగతి నుంచి 10 ఫెయిల్ అయిన వారికి కూడా శిక్షణ ఇస్తారన్నారు. టాలీ కోర్సునకు సంబందించి ఇంటర్మీడియట్ పాస్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థుల సౌలభ్యం కొరకు ప్రభుత్వ ఐటిఐలో ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డ్ జిరాక్స్, ఫోన్ నెంబర్, ఈ మెయిల్ ఐడితో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటిఐలో సంప్రదించాలన్నారు. 15 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్య వయస్కులు అర్హులన్నారు. వివరాలకు 9603859666 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సెంట్రల్ జైలుకు టిడిపి నేత పట్టాభి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గన్నవరం నియోజకవర్గంలో టిడిపి కార్యాలయంపై దాడి, విధ్వంసం ఘటనల నేపథ్యంలో అరెస్టయిన టిడిపి నాయకులు కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌ను పోలీసులు బుధవారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. తొలుత ఆయన్ని కోర్టులో హాజరుపరిచారు. రిమాండ్ నిమిత్తం ఆయన్ని గన్నవరం సబ్‌జైలుకు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఆ జైలులో ఖాళీ లేకపోవడం, వసతులు లేకపోవడంతో వేరే జైలుకు తరలించాలని పోలీసులు న్యాయమూర్తిని అభ్యర్థించారు. ఈ మేరకు పట్టాభితో పాటు మరో 11 మంది టిడిపి నాయకులను పోలీసులు సెంట్రల్‌జైలుకు తీసుకొచ్చారు. ఈ సమయంలో కనీసం మీడియాను సైతం అనుమతించలేదు. వారిని తీసుకొచ్చిన పోలీసు వాహనం సెంట్రల్ జైలులో ప్రవేశించగానే ప్రధాన ద్వారాన్ని మూసివేశారు.



కిరాణా షాపును ప్రారంభిస్తున్న సురేష్‌కుమార్

'చేదోడు'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-సామర్లకోట

చేదోడు పథకం ద్వారా అందిస్తున్న రూ.10 వేలను అందరూ సద్వినియోగం చేసుకుని చిరు వ్యాపారుల ద్వారా వారి కుటుంబానికి అండగా ఉండాలని 31వ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక 31 వార్డులో భాస్కర్ కాలనీలోని ఒక మహిళతో ఏర్పాటు చేసుకున్న కిరాణా షాపును ఆయన ప్రారంభించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు కేశవస్వామి బైపాస్ కాలనీలో ఉన్న శ్రీ విజయ కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేద పారాయణం, మహా చండీయాగంతో ఆలయ ప్రాంగణం కిట కిట లాడింది. అనంతరం అన్నదానం నిర్వహించారు.

చంద్రబాబును విమర్శించే అర్హత లేదు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జగన్ రెడ్డి బినామీగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వనరులను దోచుకుతింటున్న కాకినాడ ఎంఎల్‌ఎ ద్వారంపూడికి చంద్రబాబును విమర్శించే అర్హత లేదని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్‌ఎ టిడిపి పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వనమాడి కొండబాబు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. చంద్రశేఖర్ రెడ్డి అవినీతి అక్రమ వ్యాపారాలపై పెద్దాపురంలో చంద్రబాబు మాట్లాడిన మాటలు అన్నీ వాస్తవాలేనన్నారు. జగన్ రెడ్డి అండదండలతో పేదవాడుకు అందాల్సిన రేషన్ బియ్యం ఇతర దేశాలకు తరలించి ద్వారంపూడి వేల కోట్లు సంపాదించాడని, మైనింగ్, మట్టి, ఇసుక, మాదకద్రవ్యాల సరఫరా వంటి అక్రమ వ్యాపారాలతో ద్వారంపూడి వేలకోట్ల రూపాయలు దోచుకుతింటూ అధికారం బలం, ధన బలంతో డ్రగ్స్ మత్తులో చంద్రబాబు, లోకేష్ బాబుపై సవాళ్లు విసురు తున్నట్టు చెప్పారు. ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్న కాకినాడ పోర్టు నేడు ద్వారంపూడి అక్రమ వ్యాపారాలతో అప్రతిష్ట పాలు చేశాడన్నారు. ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి చేసే అక్రమ వ్యాపారాలను గతంలో అనేకసార్లు బయట పెట్టామని, వాటన్నింటినీ నిరూపించడానికి టిడిపి సిద్ధంగా ఉందన్నారు.

సువార్త రాజుకు ఘన స్వాగతం

సామర్లకోట : ఇజ్రాయిల్ దేశంలో 50వ సారి పర్యటించి సామర్లకోటకు చేరుకున్న పాస్టర్ ఈలి సువార్త రాజుకు ట్రూ గాస్పల్ చర్చ్ సంఘ సభ్యులు బుధవారం ఘన స్వాగతం పలికారు. ఆరాధన టీవీ ఆధ్వర్యంలో ఇజ్రాయిల్ దేశంలోని ఏసుక్రీస్తు జన్మస్థలాన్ని రాజు దర్శించారు. అనంతరం సువార్తరాజు ను ఘనంగా సన్మానించారు.

సాగుపై అవగాహనతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - పెద్దాపురం

పామాయిల్ తోటల పెంపకంపై రైతాంగం అవగాహన పెంచుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునిఉద్యాన వన శాఖ అధికారి ఎస్.సుజాత అన్నారు. బుధవారం మండలంలోని కొండపల్లిలో అగ్రిల కొండబాబు పామాయిల్ తోటలో మండల ఉద్యానవన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన పామాయిల్ రైతుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బిందు సేద్యం ద్వారా తక్కువ నీటి వసతితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. తెల్ల దోమ నివారణకు అధికారులు సూచించిన విధంగా మందులు వినియోగించాలన్నారు. పతంజలి ఫుడ్స్ ప్రతినిధి డిజిఎం డి.రవీంద్ర మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. గెలల కోత, గెలల నాణ్యత అంశాలపై రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ సదస్సులో పతంజలి ఫుడ్స్ ప్రతినిధి క్రమ మేనేజర్ కె.వెంకటేశ్వరరావు, ఫీల్డ్ ఆఫీసర్ డి.ఎల్.వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎం.వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న పామాయిల్ రైతులు

జూనియర్ సివిల్ జడ్జిగా బుల్లెమ్మ

ప్రజాశక్తి - పెద్దాపురం



పెద్దాపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా బుల్లెమ్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన జి.హర్షవర్ధన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం నూతన మెజిస్ట్రేట్ బుల్లెమ్మ బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేదుల సుబ్రహ్మణ్యం(మణి), కందుల కుమార్, సీనియర్ న్యాయవాదులు గన్నంరాజు సత్యనారాయణ, కెవి.చలం, చావలి కృష్ణారావు, తటవర్తి సత్యనారాయణ, మడికి రాంబాబు, కెవి.రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంలో రాగి జావ

ప్రజాశక్తి- కరప

ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు రాగిజావ అందించనున్నారని ఎంఇఒ కెవి.కష్ణవేణి అన్నారు. బుధవారం మధ్యాహ్న భోజన అసిస్టెంట్ పథక సంచాలకులు నాగేశ్వరరావు పాల్గొని రాగిజావ పథకాన్ని ప్రారంభించారు. మంగళవారం, గురువారం, శనివారం ఉదయం 8:45 నిమిషాలకు పిల్లలకు ఈ రాగిజావను అందిస్తామని కష్ణవేణి తెలిపారు. దీనివల్ల పిల్లల్లో పోషక ఆహార లోపానికి, ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వడ్డి వెంకటేశ్వరరావు, శ్రీరామ్, వీరభద్రావతి, అలీమ్, ప్రియవాణి, అనిత, పలక రాజు, రాజబాబు పాల్గొన్నారు.

తుది ఘట్టానికి మహిళా హాకీ ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జిల్లా ప్రాధికార సంస్థ మైదానంలో జరుగుతున్న 13వ ఇండియా సీనియర్ మహిళ హాకీ పోటీలు తుది ఘట్టానికి చేరుకున్నాయి. బుధవారం ముగిసిన లీగుల మ్యాచ్‌లతో క్వార్టర్స్‌లో 8 రాష్ట్రాలు చోటు దక్కించుకున్నాయి. బుధవారం చివరి లీగల్ మ్యాచ్‌లు అన్నీ ఏకపక్షంగా సాగాయి. మహారాష్ట్ర, తమిళనాడు మధ్య జరిగిన మ్యాచ్‌లలో 8 గోల్స్ సాధించి మహారాష్ట్ర టీమ్ విజయం సాధించగా శాలిని భగవాన్ ప్లేయర్‌ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంది. పాండిచ్చేరి అండమాన్ నికోబార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో పాండిచ్చేరి 12 గోల్స్ సాధించి విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఆగ్నేష్ దక్కించుకుంది.



మధ్యప్రదేశ్, ఢిల్లీ మధ్య మ్యాచ్

వినియోగదారుల చట్టంపై అవగాహన

ప్రజాశక్తి- పెద్దాపురం

స్థానిక రామారావు పేటలోని 14, 15 వార్డుల సచివాలయంలో బుధవారం సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లకు వినియోగదారుల చట్టం-2019పై అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టంపై అవగాహన పెంచుకుని తమ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మోసాలకు గురైన వినియోగదారులు కన్స్యూమర్ కమిషన్ ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. వినియోగదారులకు న్యాయం చేసేందుకు మూడంచెల కోర్టులు ఉన్నాయన్నారు. ఈ సదస్సులో సచివాలయ కార్యదర్శి ఏడుకొండలు, వినియోగదారుల సంఘం కార్యదర్శి ఎం.భాస్కర్ రావు, సభ్యులు కెవిపి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూర్యనారాయణ మూర్తి

బ్యాంక్ లింకేజీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల పథకంలోని గృహ నిర్మాణ లబ్ధిదారులకు రూ.35 వేల బ్యాంకు లింకేజీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం కొమరగిరి లేఅవుట్‌లో గృహనిర్మాణ ప్రగతిపై అదనపు కమిషనర్ సిహెచ్ నాగనరసింహారావుతో కలిసి హౌసింగ్, ప్రత్యేకాధికారులు, ఇతరశాఖల అధికారులతో కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాల కోసం సుమారు 9,416 మంది అగ్రిమెంట్లు పూర్తి చేసుకోగా, 3,300 ఇళ్లు గ్రౌండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి గృహనిర్మాణ లబ్ధిదారులుగా ఉన్న 4,536 మంది గృహనిర్మాణ లబ్ధిదారులకు రూ.35 వేల చొప్పున బ్యాంకు లింకేజీ ప్రక్రియ పూర్తయ్యిందని, మిగిలిన 5 వేల మందికి త్వరితగతిన లింకేజి ప్రక్రియ పూర్తయ్యేలా బ్యాంకర్లతో చర్చించాలని సూచించారు. అలాగే ఎమినిటి కార్యదర్శులు జియోట్యాగింగ్‌తోపాటు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లింపు ప్రక్రియపై ప్రత్యేక దష్టిపెట్టాలన్నారు. సిఒలు కూడా ఈ అంశంపై నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా గృహనిర్మాణాల ప్రక్రియ వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. అదనపు కమిషనర్ నాగనరసింహారావు మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నందున దీనిపై లక్ష్యసాధన దిశగా ప్రగతి సాధించాలన్నారు.

మహారాజశ్రీ కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేటు వారి కోర్టు

C.C.No. 208/2017

Between:

Nune Sati Raju ...*Petitioner /Complainant*

AND

Bikkina Sai, S/o. Verraju, 48 years, D.No. 4-40, Sai Nilayam, Turangi, Kakinada-2. ...*Respondent / Accused*

పై నెంబరు గల కేసులో పిటీషనరు అయిన నూనె సత్తిరాజు, రెస్పాండెంటు అయిన బిక్కిన సాయి అను మీపై చెక్ బౌన్స్ కేసు వేసినారు. మీరు కోర్టు సమన్లు అందుకున్నప్పటికీ మీరు కోర్టుకు రావడం లేదు. గౌరవ కోర్టు వారు మీపై నాన్‌బెయిల్‌బుల్ వారెంటు జారీ చేసి కోర్టు కమీషనర్‌ని కూడా నియమించినారు. పలుమార్లు కోర్టు కమీషనర్ వారు మీ యొద్దకు వచ్చి కోర్టుకు తీసుకొని వచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తప్పించుకొంటున్నారు. ఈ ప్రకటన ద్వారా కోర్టు వారు ఉత్తర్వుల ప్రకారం **ది.24-02-2023న వాయిదా వేసినారు. కావున ఆరోజు ఉదయం గం|| 10:30 ని||లకు కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు ఉత్తర్వుల ప్రకారం)

కోర్టు వాయిదా తేదీ : ది.24-02-2023

టి.పృథ్వీరాజు, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9618872222

మోహన్ కుటుంబానికి దొరబాబు పరామర్శ

ప్రజాశక్తి-సామర్లకోట

మున్సిపల్ కౌన్సిలర్ జట్ల మోహన్ తండ్రి సుబ్బారావు ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని బుధవారం హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దవులూరి దొరబాబు పరామర్శించారు. ఈ కార్యకమంలో ఆవాల లక్ష్మీనారాయణ, సేపేని సురేష్, యార్లగడ్డ జగదీష్, మేకా శ్రీను, శెట్టిబత్తుల దుర్గ తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న దొరబాబు తదితరులు

NAME CHANGE

I, PYDISETTY BHULOKAM, S/o. Dorayya, D.No. 5-337, Post Office Veedhi, Vadisaleru Village, East Godavari 533294, A.P., I hereby declare that, I have been changed my Minor Son's name from **YAZNA DORA VENKATA SAI HARSHA** (Old Name) to **PYDISETTY YAZNA DORA VENKATA SAI HARSHA** (New Name). Hence my minor son's Documents and correspondence will be continue with his new name **PYDISETTY YAZNA DORA VENKATA SAI HARSHA** vid affidavit Dt. 24-01-2023.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

బాలిక కిడ్నాప్ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్ఐ కె.రామారావు తెలిపిన వివరాల మేరకు వేలివెన్నులో ఒక ప్రైవేట్ కళాశాలలో బాలిక విద్యనభ్యసిస్తోంది. ఆమెను ప్రేమ పేరుతో ఇద్దరు నమ్మించారు. ఆదివారం పేరెంట్స్ విజిటింగ్ కోసం ఔటింగ్ ఇవ్వగా బీహార్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు బాలికను తీసుకెళ్లారు. దీనిపై కిడ్నాప్ కేసు నమోదైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉండ్రాజవరం ఎస్ఐ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి గాలించారు. నిందితులను పట్టుకుని బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. కేసును వెంటనే చేదించిన ఎస్ఐ, ఎఎస్ఐ ప్రసాద్‌రావు, హెచ్‌సిలు జ్యోతిబాబు, బుజ్జి, కానిస్టేబుల్స్‌ను డిఎస్‌పి అభినందించారు.



దుకాణంను ప్రారంభిస్తున్న ఎస్ఐ రామారావు.

ఉండ్రాజవరంలో మందుల దుకాణం పారంభం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరంల నూతనంగా ఏర్పాటు చేసి న మందుల దుకాణాన్ని ఎస్ఐ కె.రామారావు బుధ వారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఫార్మసీ సేవలు గ్రామీణ ప్రాంతాల్లోనూ అభివృద్ధి చెందాల న్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఫార్మసీ ఎగ్జి క్యూటివ్స్ షరీఫ్, కె.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-మండపేట

నియోజవర్గంలో టిడిపి శ్రేణులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్ఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన నివాసంలో పార్టీ మండల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జ్, నాయకులతో శుక్రవారం ఏలూరులో నిర్వహించే జోన్-2 సమావేశంపై చర్చించారు. వేగుళ్ల మాట్లాడుతూ పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలైన ఇదేం-ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి బూత్ కన్వీనర్ల క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్ లతో సమన్వయంతో ఇంటింటికి వెళ్లి త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ రెడ్డి ప్రసాద్, మాజీ జిల్లా గ్రంథా లయ సంస్థ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడులపై టిడిపి నాయకుల ఖండన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

రాష్ట్రంలో దౌర్జన్య పాలన సాగుతోందని ప్రభుత్వ దాడులను టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో వైసిపి తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. ప్రభుత్వం దాడులను తక్షణమే ఆపాలని లేకుంటే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు సాయం అందిస్తున్న గిరజాల బాబు, స్టాలిన్

ప్రజాశక్తి - కడియం

కడియం మండలంలో సంభవించిన వేర్వేరు అగ్ని ప్రమాదాల్లో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు బాధ్యత సేవా సంస్థ చేయూతనందించింది. వ్యవస్థాపక అధ్యక్షులు గిరజాల బాబు ఆధ్వర్యంలో జేగురుపాడు పంచాయతీ పరిధిలో ఉన్న పాములమెట్ట కాలనీలో బుధవారం అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు వంట పాత్రలు, బియ్యం, నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేశారు. అలాగే కడియపులంక పంచాయతీ పరిధిలో ఉన్న దోసాలమ్మ కాలనీలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు సామగ్రి అందించారు. జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా బాధ్యత సేవా సంస్థ ఆధ్వర్యంలో గిరజాల బాబు అగ్ని బాధితులకు మానవత్వంతో చేస్తున్న సేవలను ప్రశంసించారు. గిరజాల బాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునే తత్వం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, ఎంపిటిసి మాజీ సభ్యులు రంపం గోపాలకృష్ణ, కె.బాబులు, ఎం.మహేష్, ఎ.వెంకట్రావు, బి.అన్న వరం, సర్కార్ భాష, కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ దేవత ఉత్సవ కమిటీ సమావేశం

మోదుగులమ్మ జాతరకు ముహూర్తం

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి ప్రజలు ప్రతి ఐదేళ్లకోశారి చేసుకునే గ్రామ దేవత మోదుగులమ్మ జాతర ఏప్రిల్ 23, 24, 25 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించేందుకు బుధవారం సాయంత్రం గ్రామదేవత ఆలయం వద్ద ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏప్రిల్ 25న గ్రామ దేవతకు నైవేద్యాలు అందజేయడంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు, పారిశ్రామికవేత్త సింహాద్రి జనార్ధనరావు, బిసి నాయకులు నక్కా చిట్టిబాబు, బి.వెంకటేశ్వరరావు, పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

బిసిలకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - గోపాలపురం

ముఖ్యమంత్రి జగన్ అన్ని పదవుల్లో బిసిలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇది హర్షణీయమని బిసి చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెలగల దుర్గారావు అన్నారు. బుధవారం గోపాలపురంలో బిసి చైతన్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్‌గా నియమితులైన తానింకి గంగరాజుని ఘనంగా సత్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడారు. 18 ఎంఎల్‌సి స్థానాల్లో 11 స్థానాలను బిసిలకు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. మండల, జిల్లా పరిషత్, కార్పొరేషన్లనలోనూ బిసిలకు అగ్రస్థానం ఇచ్చారన్నారు. నామినేషన్లలో పదవుల్లోనూ, దేవస్థాన కమిటీల్లోనూ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత బిసిలకే దక్కిందన్నారు. తానింకి సత్యనారాయణ మాట్లాడుతూ బిసిలకు అధికప్రాధాన్యతనిస్తున్న సిఎం జగన్‌కు, స్థానిక ఎంఎల్ఎ తలారి వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పడమటి సత్యనారాయణ, డి.ముత్తయ్యనాయుడు, వి.శశికుమార్, టి.సత్యనారాయణ, బి.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు,సిబ్బంది

3వ రోజుకు తపాలా ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తపాలా ఉద్యోగుల నిరసన బుధవారం నాటికి 3వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తపాల ఉద్యోగల సంఘం కార్యదర్శి బి.కొండబాబు మాట్లాడారు. అధికారులు బెదిరింపు దోరణిని విడనాడాలన్నారు. ఉద్యోగులపై వేదింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజలకు సేవ చేయడానికి తపాలా ఉద్యోగులు ఎప్పుడూ ముందుంటారన్నారు. ఎప్పటికప్పుడు విధిస్తున్న కొత్త ఖాతాల లక్ష్యాలను ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నా అనువుగాని టార్గెట్స్ విధించి వేధిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులు నిరసన చేస్తున్నప్పటికీ అధికారులు మాత్రం లక్ష్యాలు పూర్తి చేయాల్సి ఒదేనంటూ ఒత్తిడి తెస్తున్నారన్నారు. సిబ్బంది ఐక్యంగా ఈ విధానాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు యుజి.ప్రకాష్, జెవి.సతీష్, ఎవి.నరసింహారావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - గోపాలపురం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆంగ్ల అధ్యాపకులు ఈడూరి గంగరాజు తన సొంత ఖర్చులతో స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.రఫిక్ అహ్మద్, అధ్యాపకులు గంగరాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్, గోవాడ జాన్‌పీటర్, జి.నిర్మలకుమారి, పి.రత్నకుమారి, ఎంవిడి.భవాని, జి.అప్పారావు, కె.అప్పాజీ, దుర్గ పాల్గొన్నారు.

ఘనంగా కవలల దినోత్సవం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం పట్టణంలోని స్థానిక వాగ్దేవి ఇంగ్లిష్ మీడియం పాఠశాల్లో బుధవారం కవలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్రీరామ చంద్రమూర్తి కవల పిల్లలైన విద్యార్థులను అభినందించారు. **కొత్తపేట** విద్యా బాల మందిర్ హైస్కూల్లో కవలలు దినోత్సవాన్ని నిర్వహించారు.

ప్రకటన

మహారాజ శ్రీ నిడదవోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి-కమ్-జ్యుడీషియల్ ఫస్టు క్లాసు మెజిస్ట్రేట్ వారి కోర్టులో

IA 842/2022 in OS No.174/2022

Between :

గుమ్మడి భీమారావు - పిటీషనరు/వాది

And

తిరుమళ్ళ రంజిత్ కుమార్ - రెస్పాండెంట్/ప్రతివాది

To,

తిరుమళ్ళ రంజిత్ కుమార్ S/o గౌతు మునేశ్వర రావు, D.No.2-34, పోస్టాఫీసు వీధి, అట్లపాడు, నిడదవోలు మండలం, తూ||గో||జిల్లా.

పై నెంబరు దావాలో మీకు నోటీసులు, సమన్లు పంపినను మీరు తీసుకోనందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు దావా మీ హాజరు నిమిత్తం **ది.07-03-2023 తేదికి వాయిదా అయి ఉన్నది.** కనుక ఆ రోజు **ఉదయం 10.30 లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై మీ తరుపున సమాధానం దాఖలు చేసుకోవలయును. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానము చేయబడునని తెలియజేయడమైనది. **వాయిదా తేది. 07-03-2023.**

ఫణితిన వీరాంజనేయ చౌదరి, B.Com.BL
అడ్వకేట్, నిడదవోలు,
తేది : 20.02.2023 సెల్: 93932 24546.

మహారాజశ్రీ 6వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. 166/2022

Between:

Matta Naga Venkata Satyanarayana ...*Plaintiff*

AND

D-1: Arepu Karuna Priya, W/o. late Rajendra Prasad, Hindu, aged 50 years, House wife, D.No. 8-23-9, Putchalavari Street, Vullithota vari Veedhi, Rajamahendravaram.

D-2: Arepu Sunil Datta, S/o. late Rajendra Prasad, Hindu, aged 25 years, D.No. 8-23-9, Putchalavari Street, Vullithota vari Veedhi, Rajamahendravaram.

D-3: Arepu Phani Datta, S/o. late Rajendra Prasad, Hindu, aged 23 years, D.No. 8-23-9, Putchalavari Street, Vullithota vari Veedhi, Rajamahendravaram.

...*Defendants*

పై నంబరు దావాలో 1, 2 3 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 27-2-2023 సం||రం తేదీ ఉదయం 10.30 ని||లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.ఎస్.ఎస్.మురళీమోహన్
జి.వి.రామలక్ష్మి
రాజమండ్రి 22-2-23 అడ్వకేట్లు, రాజమండ్రి

ఒరిజినల్ దస్తావేజు పోయినది

అమలాపురం మండలం, చిందాడ గరువు గ్రామంనకు చెందిన మామిల్లపల్లి కన్న గోపాల్ కి చెందిన 20 సెంట్లు గల భూమికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు **(Doct. No. 4241/2004)** అమలాపురం పట్టణమునకు జిరాక్స్ నిమిత్తం తీయించుకొనుటకు వస్తున్న సమయంలో మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు అందివ్వగలరు అని కోరుచున్నాము.

ఇట్లు: మామిల్లపల్లి కన్న గోపాల్
S/o. రామారావు, డో.నెం. 1-319,
చిందాడ గరువు, అమలాపురం మండలం
డా|| బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్: 7382358609

ఒరిజినల్ దస్తావేజు పోయినది

కొవ్వూరు పట్టణంకు చెందిన నిమ్మగడ్డ పుల్లారావు గారి భార్య నిమ్మగడ్డ ధనలక్ష్మి అను నాకు రాజమహేంద్రవరం సిటీలో గల శంభునగర్‌లో 311.11 చ||గ|| ఖాళీ ఇంటి స్థలు కలదు. ఈ ఖాళీ స్థలం రాజమండ్రి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో **నం. 4493/94** తో నా పేరున రిజిస్టర్ కాబడి యున్నది. ఈ ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు ది. 15-02-2023వ తేదీన జిరాక్స్ నిమిత్తం మెయిన్ బజార్‌కు వెళ్లుచుండగా మార్గ మధ్యలో పడిపోయినది. ఈ దస్తావేజు దొరికినవారు క్రింది చిరునామాకు సమాచారం అందించగలరు.

నిమ్మగడ్డ ధనలక్ష్మి
W/o. పుల్లారావు,
డో.నెం. 15/4/21, కొవ్వూరు
సెల్: 9704399551

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ రామచంద్రాపురం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 37/2018

Between:

Ramesh Kumar ...*Plaintiff*

AND

Gubbala Srinivasa Rao ...*Defendant*

Defendant:

Gubbala Srinivasa Rao, S/o. Subbarao, age 37 years, Hindu, R/o. Vegayamma peta, Ramachandrapuram Mandal, E.G.Dt., R.C.Puram D.M.C.

పై నెంబర్ గ్రంథంలో పై వాది పరిహారం నిమిత్తం పై కోర్టులో మీ పై దావాను దాఖలు చేయగా, సదరు కోర్టు వారు అనేక పర్యాయములు సమున్లు కోర్టు నుండి పంపగా మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. అందుపై శ్రీ కోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా మీకు సమన్లు అమలు జరుపుటకు ది.వి. 28-02-2023వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున మీరు గాని, మీ తరుపున ప్లీడరు గాని శ్రీ కోర్టు వారి ఎదుట **ది.వి. 28-02-2023వ తేదీన ఉదయం 10.30 ని||లకు** హాజరు అయ్యి మీ తరుపున ఆక్షేపణలు ఏమైనా ఉంటే దాఖలు చేయగలరు. లేనియెడల మీ తరుపున శ్రీ కోర్టు వారు పరోక్షమున ఉత్తర్వులు చేయగలరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

K.GOVINDA RAJULU
Advocate, Kunduru
K.Gangavaram Mandal
రామచంద్రాపురం
తేది. 22-2-2023 Cell: 9866470830

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

I.A. No. 713/2022, I.A. No. 714/2022
I.A. No. 715/2022, A.S. No. 16/2022

Between:

పిటిషనరు/అప్పిలెంటు:
శ్రీ గుడిగంట్ల చంద్రశేఖరరావు

Vs

రెస్పాండెంటు/ రెస్పాండెంటు:
శ్రీ గుడిగంట్ల వెంకటేశ్వరరావు వగైరా

6th Respondent: షేక్ షాజహన్, S/o. మస్తాన్, పు|| ముస్లిం, 2వ వార్డు, డోర్ నెం. 2-9-20, R/o. నిడదవోలు.

7th Respondent: అబ్దుల్ ఇబ్రహీం, S/o. అబ్దుల్ గాలిఫ్, పు|| ముస్లిం, డోర్ నెం. 2-19-11, R/o. నిడదవోలు.

8th Respondent: అబ్దుల్ సనావుల్లా, S/o. అబ్దుల్ గాలిఫ్, పు|| ముస్లిం, డోర్ నెం. 2-9-25, R/o. నిడదవోలు.

యీ నెంబరు అప్పీలు మరియు పై పిటిషన్లలలో 6 to 8 రెస్పాండెంట్లు అయిన మీపై దాఖలు చేయగా సదరు అప్పీలు మరియు పిటిషన్లలల 6 to 8 రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా మరియు పోస్టల్ ద్వారా పలుమార్లు నోటీసులు పంపించినను ఉద్దేశ్యపూర్వకంగా Avoid చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పై నెంబరు అప్పీలు మరియు పిటిషన్లలలో 6 to 8 రెస్పాండెంట్లు అయిన మీరు శ్రీ కోర్టు వారి ఎదుట **ది. 27-2-2023వ తేదీన ఉదయం 10 గం|| 30 ని||లకు** స్వయంగా గాని, లేక వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియపర్చగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

కొవ్వూరు **నూకవరపు రవిబాబు**
21-2-23 అడ్వకేట్, కొవ్వూరు

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

I.A. No. 716/2022, I.A. No. 717/2022
I.A. No. 718/2022, I.A. No. 407/2022
A.S. No. 16/2022

Between:

పిటిషనరు/అప్పిలెంటు:
శ్రీ గుడిగంట్ల చంద్రశేఖరరావు

Vs

రెస్పాండెంటు/ రెస్పాండెంటు:
శ్రీ గుడిగంట్ల వెంకటేశ్వరరావు వగైరా

6th Respondent: షేక్ షాజహన్, S/o. మస్తాన్, పు|| ముస్లిం, 2వ వార్డు, డోర్ నెం. 2-9-20, R/o. నిడదవోలు.

7th Respondent: అబ్దుల్ ఇబ్రహీం, S/o. అబ్దుల్ గాలిఫ్, పు|| ముస్లిం, డోర్ నెం. 2-19-11, R/o. నిడదవోలు.

8th Respondent: అబ్దుల్ సనావుల్లా, S/o. అబ్దుల్ గాలిఫ్, పు|| ముస్లిం, డోర్ నెం. 2-9-25, R/o. నిడదవోలు.

యీ నెంబరు అప్పీలు మరియు పై పిటిషన్లలలో 6 to 8 రెస్పాండెంట్లు అయిన మీపై దాఖలు చేయగా సదరు అప్పీలు మరియు పిటిషన్లలల 6 to 8 రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా మరియు పోస్టల్ ద్వారా పలుమార్లు నోటీసులు పంపించినను ఉద్దేశ్యపూర్వకంగా Avoid చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పై నెంబరు అప్పీలు మరియు పిటిషన్లలలో 6 to 8 రెస్పాండెంట్లు అయిన మీరు శ్రీ కోర్టు వారి ఎదుట **ది. 27-2-2023వ తేదీన ఉదయం 10 గం|| 30 ని||లకు** స్వయంగా గాని, లేక వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియపర్చగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

కొవ్వూరు **నూకవరపు రవిబాబు**
21-2-23 అడ్వకేట్, కొవ్వూరు